28. సిద్ధాన్నం

ఈ వెధవవూరు వొచ్చాక వెంకట్రావుకు మతిపోయినట్లుగా వుంది - ఇక్కడ స్నేహితులు లేరనీకాదు. పెద్దపెద్ద సినిమా హాల్సు, హొటళ్లూ లేవనీ కాదు. ఇన్నాళ్ళూ పెద్దపట్టణంలో వుండి, యీ పట్టణమూకాని, పల్లేకాని వూరనీ కాదు - ఇక్కడ జీవించటం ఎలాగో తెలియక!

అంటే వెంకట్రావు జీవనాధారం లేక, ఈ వూరు వొచ్చిన వాడు మాత్రం కాదు, ఉద్యోగంలో ట్రాన్స్‌ఫర్ ఐ వొచ్చాడు. ఇక్కడి వాతావరణానికి అలవాటు కాలేక సతమతమౌతున్నాడు.

వెంకట్రావుకు పట్టుకున్నదల్లా ఆర్థిక బాధే! ఏవిధంగా చూసినా తన జీతం చాలదు. అందుకని పైయెత్తున కాస్తో కూస్తో గుంజుకోవటానికి గత పదేళ్ళనుంచీ అలవాటుపడ్డాడు. ఐతే వెంకట్రావుకు నియమాలు అంటూ లేవేమో ననేందుకు వీల్లేదు. ఎందుకంటే అతను నోరు తెరిచి ఎవర్నీ, ఎప్పుడూ, ఏమీ అడగలేదు. తను కష్టపడి పనిచేసి పెడతాడు : తన కష్టాన్ని గ్రహించి ఎదుటివాడు ఇచ్చే తృణమో పణమో తీసుకుంటాడు : తక్కువైందని అతనెప్పుడూ సణగలేదు.

ఐతే ఇక్కడి మనుషులూ, వాళ్ళ అభిరుచులూ, ఆచారాలూ మొదలైనవి తనకు ఎంతో కొత్తగా వుండటంవల్ల మొదటినుంచీ చాలా జాగ్రత్తగా వున్నాడు. ఎప్పుడో వొస్తుందికదానని, ఇప్పటినుంచే ఆ వొచ్చే దానిస్థాయిలో అనుభవించటం అవివేకమని వెంకట్రావుకు తెలుసు. అదీ గాక, చేతిలో లేనిదే ఏం అనుభవించ గలుగుతాడు కనుక?

అందుకని ఖర్చుతో ఇదివరకులాగు కాకుండా వొళ్ళు దగ్గర పెట్టుకొని వున్నాడు. నిజానికి యీవూరు వొచ్చాక అనేక సౌఖ్యాలను వొదులుకున్నాడు. ఏ విధంగానైనా సంపాదనకూ, ఖర్చుకూ సరిపెట్టుకుందామని ఎంత గుంజుకున్నా సాధ్యం కావటం లేదు. జీవితం చాలా అసంతృప్తికరంగా తోచింది. మరీ సంవత్సరాల తరబడిగా గడపిన జీవితస్థాయికి, ప్రస్తుత జీవితస్థాయికీ - కొండకూ, కొండకింది లోయకూ వున్నంత భేదంవుంది... తీపిపదార్థం తిన్నాక, సముద్రపునీళ్ళు తాగినట్లయింది-

ఈ సమస్యను భేదించేందుకు వెంకట్రావు గత రెండు నెలలనుంచీ తలబద్దలు కొట్టుకుంటున్నాడు. మొదట్లో ఆఫీసులో అందరూ తననొక వింతమృగమల్లే చూశారు. తనను వాళ్ళు గౌరవించక పోయినా తనను యేవగించుకునేట్లుగా ప్రవర్తిస్తారని అతను యెన్నడూ అనుకోలేదు. రైలుపెట్టె లోకి కొత్తగా ఎక్కినవాణ్ని తగినంత ఖాళీవున్నా అంతకు ముందున్న ప్రయాణీకులు ఆహ్వానించక పోవటంలోగల మనస్తత్వమే ఇక్కడా అతనికి ప్రత్యక్షమైంది.

రోజులు గడిచినకొద్దీ తనతో పాటే పనిచేసే ఇతర గుమాస్తాలు తనతో కలిసిపోక తప్పదనే నమ్మకం వెంకట్రావుకు లేకపోలేదు. అతడు తలచిన విధంగానే వెంకట్రావుతో మిగతా వాళ్ళు కలవకపోయినా, వెంకట్రావే మిగతా వాళ్ళతో కలిసిపోయి, కొత్తదనంలోని బాధ, ఒంటరితనంలోని భారం చాలావరకు వొదిలించుకున్నాడు.

యీ పరిస్థితి తెచ్చుకునేందుకు వెంకట్రావు చాలా తంటాలుపడ్డాడు. గుమాస్తాలంతా తనను లెక్కచెయ్యకుండా మూతిముడుచుకొని కూర్చున్నా, వాళ్ళ షేక్స్‌పియర్ మొహాలుచూసి తనమనసు మండిపడుతూన్నా పైకిమాత్రం చిరునవ్వుతో వాళ్ళను పలకరించి ఎలాగో వాళ్ళ దయ కోసం పాకులాడి సాధించాడు. లౌకికవ్యవహారాల్లో యీ రకం తెలివి తేటల్ని ఉపయోగించి కొంత నటించైనా సరే పని గడుపుకోవటం వెంకట్రావుకు యీనాడు కొత్తకాదు.

ఐతే మిగతా ఉద్యోగులతోడి పరిచయం కొద్దిగా స్నేహరూపం దాల్చి, మరి పెరగకుండా అట్టే నిలచిపోయింది. 'ఓహొ!' అనుకుంటే 'ఓహొ' తోనే ఆగినదాన్ని వెంకట్రావు ఎంత ప్రయత్నించినా ముందుకు సాగించలేక పొయ్యాడు. ఎన్నిసార్లు యీ ఉద్యోగులతో కాఫీహొటల్‌కు వెళ్ళి, వాళ్ళబిల్స్ తాను చెల్లించినా మరి లాభం లేని పరిస్థితి ఏర్పడింది. యీ విషయాన్ని గ్రహించాక వెంకట్రావు ఇక దమ్మిడీకూడా వీళ్ళ కింద ఖర్చు చేయకూడదని నిశ్చయించుకున్నాడు. అసలు ఖర్చులు సరిపెట్టుకోవటం ఎలాగా అని ఛస్తున్న వెంకట్రావుకు ముందు యీ ఖర్చును తగ్గించుకోవటం అత్యవసరమైంది...

వెంకట్రావు ఆలోచనలు అన్ని వైపులకూ విస్తరించసాగినవి. సూక్ష్మంగా యీ సమస్యను భేదించటం కుదరనందువల్ల, ఇక్కడివాళ్ళ వింత మనస్తత్వం ఏమిటా అని తీవ్రంగా ఆలోచించసాగాడు.

వొచ్చిన కొత్తల్లో అందరికీ నమస్కరించటం, ఏదో వాళ్ళదయవల్లనే తానిక్కడ పదికాలాలపాటు ఉద్యోగాన్ని చేసుకునేందుకు వొచ్చినట్లు సూచించటం మొదలైన నక్క వినయాలు ప్రదర్శించాడు కాని, అవి అంతగా ఫలించలేదు ... ఇతర విధానాలుకూడా విఫలమైనవి. దీని కీలకం ఏమిటి?

తను రాకపూర్వం వాళ్ళెట్లా ఉండే వాళ్ళో ఆ సంగతి తనకు అనవసరం కాని ఇప్పుడు మాత్రం ప్రతి ఒక్కడికీ మిగతావాళ్ళంతా భయపడుతున్నట్లుగానే వుంటున్నారు. అంటే ఇందులో తన గొప్పాలేదు; మినహాయింపూ లేదు. తను కొత్తవాడు కనుక, తను ఎలాటివాడో తెలియక వీళ్ళంతా దూరదూరంగా వుంటున్నారేమోనని మొదట్లో తను అనుమానపడ్డాడు. కాని ఎన్నాళ్ళు జరిగినా తనను కొత్తవాడుగానే వాళ్ళు పరిగణిస్తున్నారు. కాని ప్రతి వొక్కణ్ని మిగతావాళ్ళంతా ఏదో అనుమానంతో, తమకు హానిచేస్తాడేమో ననే భయంతోనే చూడటంలో వెంకట్రావుకు కొంత తృప్తి కలిగింది.

మరి యీ వింత మనస్తత్వమేమిటి? ఇదివరకు తను పని చేసిన ఆఫీసులో గుమాస్తాలు అంతా కలిసికట్టుగా ఉండేవాళ్ళు. ఎవరైనా తప్పు చేస్తే మిగతా అందరూ కలిసి వాణ్ణి రక్షించేందుకు విశ్వప్రయత్నం చేసేవాళ్ళు. వారందరి మధ్యా ఐక్యతా, సానుభూతి కనిపించాలి. గుమాస్తా జీవితంమీద రోతపుట్టినా, ఆ కష్టసుఖాలు తెలిసిన గుమాస్తాల సానుభూతి తనకు ఉండేది.

అసలు ఆ మాటకొస్తే ఆఫీసరు–హెూదాకు ఆఫీసరే ఐనా గుమాస్తాలంటే ఎంతో దయగా ఉండేవాడు. గుమాస్తా తప్పు చేస్తే దాన్ని కప్పేందుకు ఆఫీసర్ కూడా తంటాలుపడేవాడు. అన్యోన్యంగా వున్న కుటుంబంలోని వ్యక్తులల్లే హాయిగా వుండేవాళ్లు. ఎవరెంత సంపాయించుకున్నా, ఏడవటం లేదు.

నిజానికి ఆ ఆఫీసులో కూడా మొదట్లో తనను అంటరాని వాణ్ణిగా దూరానే వుంచారు. తనుకూడా వాళ్ళు దగ్గర పెట్టుకొని పనిచేసేవాడు. ఎవరైనా తృణమో, పణమో ముట్టజెపుతే తను అంగీకరించేవాడు కాదు...

వెంకట్రావుకు చాలా గొప్ప గొప్ప ఆశయాలు ఉండేవి. ఉద్యోగంలో ప్రవేశించక పూర్వం 'లంచం' పట్టటాన్ని అతను నిశితంగా విమర్శించేవాడు. లంచం పట్టకుండా మాడి చావటంలోనే గొప్పతనం వుందనీ, అదే దేశానికీ, ప్రజలకూ ఒక వ్యక్తి చూపగల త్యాగమనీ అతని నిశ్చితాభిప్రాయం –

కాని నిశ్చితాభిప్రాయాలనేవి ఏ మనిషికైనా వేళ్ళమీద లెక్కపెట్టేవిగానే వుంటవి. వాతావరణ మాహత్మ్యం వల్ల నిశ్చితాభిప్రాయం కరిగి, తిరిగి గడ్డకట్టి వేరొక నిశ్చితాభిప్రాయంగా తయారువుతుంది. మొదటి నిశ్చతాభిప్రాయానికి రెండోదానికి పోలికే వుండదు–

వెంకట్రావు నిశ్చితాభిప్రాయంకూడా అలాగే మారిపోయింది. ఐదారు నెలలు ఎలాగో ఓర్చుకొని తన ఆశయాన్ని పట్టుకొని వేళ్ళాడగలిగాడు కాని, ఆశయానికీ,

యథార్థ జీవితంలోని కష్టానికిగల భేదాన్ని చూసేటప్పటికి, ఆశయం సడల నారంభించింది. తన ఈ విముఖత్వాన్ని మిగతా గుమాస్తాలు ఏవగించుకోసాగారు. తనను మరింత అంటరానివాడుగా దూరాన వుంచ సాగారు. ఐనప్పటికీ వెంకట్రావు బాధ పడలేదు. ఎందుకంటే తాను ఆశయంకోసం నిలబడగలిగాడు. మిగతావాళ్ళందరికన్నా తన ఆధిక్యత స్పష్టంగా కనిపిస్తూనే వుంది. అందుకు తాను గర్వపడ్డాడు. విశేషించి తన ఈ పట్టుదలకు మిగతావాళ్ళు ఈర్ష్య పడసాగారు; వాళ్ళ యీర్ష్య తన గొప్పతనాన్ని మరింతచేసింది.

తను వొచ్చిన మొదట్లో అందరూ పత్తిత్తుల్లాగానే సంచరించసాగారు. ఎందుకనో కాని మొదటినుంచీ ఈ ఉద్యోగులందరూ దొంగలనీ, లంచగాళ్ళనీ వెంకట్రావుకు అనుమానం. తన అనుమానం యెంతవరకూ నిజమో తెలుసుకునేందుకుగాను అతను ఒక్కొక్కరి ప్రవర్తనే జాగర్తగా కనిపెడుతూ వుండేవాడు. ఈ విధంగా తను కనిపెడుతున్నాడని మిగతావాళ్ళకు తెలిసి వాళ్ళూ తగిన జాగర్తలు పడ్డారు. 'లంచం' అనేమాట తామెప్పుడూ విననట్టే వాళ్ళు సూచించేవాళ్ళు. ఒకళ్ళిద్దరు లంచాన్ని గూర్చి, ఆ నీచత్వాన్ని గూర్చి వెంకట్రావుతో చర్చించారు కూడాను. వాళ్ళ అభిప్రాయాలు సరిగ్గా తన అభిప్రాయాలకు అతికినవి. ఆరోగ్యకరమైన యీ భావాలను వెంకట్రావు మెచ్చుకున్నాడు కాని, వీళ్ళు పైకి మాట్లాడే తీరులో అతనికి అనుమానం వొదల్లేదు. అందుకని తాను కనిపెట్టదలుచుకున్న నగ్నసత్యంకోసం మరింత పట్టుదలతో వున్నాడు.

నెలరోజులు తిరక్కముందే వెంకట్రావు సత్యాన్ని పరిశోధించగలిగాడు. తనతో లంచాన్ని నీచంగా చిత్రించిన పెద్ద మనుషులే లంచంపట్టటం తను కళ్ళారా చూశాడు. ఐతే, తను చూస్తున్నట్లు వాళ్ళకు తెలిసినా లెక్కచెయ్యలేదు. తానసలు అక్కడలేనట్లుగానే వాళ్ళు చేతులు తడిచేసుకున్నారు. ఏమిటీ, వీళ్ళ ధైర్యం! తననొక నాపకింద జమకట్టారు. వీళ్ళ నీచత్వాన్ని బహిరంగంగా ఖండించాలని అతను అనుకున్నాడు కాని, ధైర్యం లేక ఊరుకున్నాడు.

ఐనా వాళ్ళెలా ఛస్తే తనకేం! ఇప్పుడు తనేమైనా అంటే, మిగతా అందరూ ఏకమై తనను ఒంటరివాణ్ణి చేసేస్తారు, ఆశయం సంగతి దేవుడి కెరుక - ఇంతమందితో విరోధం పెట్టుకొని తను సాధించే దేమిటి? ఈనాడు తానీ లంచగొండితనాన్ని రూపుమాపగలడా? తను తన ఆశయ ప్రకారం తాను కాలుజారకుండా వుండి, ఆత్మతృప్తిని పొందగలుగుతున్నంత సేపూ, ఈ మిగతా నీచులతో తనకు సంబంధం ఏమిటి? వాళ్ళు తనను లెక్కచేయనట్లే, తనూ వాళ్ళను లెక్క చేయకుండా వుంటే - కుక్కకాటుకు చెప్పుదెబ్బల్లే సరిపోతుంది.

మొదటిసారి ధైర్యంచేసి తన యెదుట లంచం పట్టిన వాళ్ళు వేసినదారి, ఇప్పుడు తగినంత పెద్దదయింది. మిగతా వాళ్ళుకూడా యధేచ్ఛగా లంచం పట్టసాగారు. ఎవడిగోల వాడిదిగా తయారైంది. కేవలం తనొక్కడూ ఈ నీచానికి పాలుపడకుండా,

తన పవిత్రతను కాపాడుకుంటూ వస్తున్నాడు; ఇది మిగతావాళ్ళకు గుర్రుగా ఉన్నా తన ఆశయానికి మరింత బలాన్ని చేకూర్చింది. ఇంతకు పూర్వం వాళ్ళంతా తనను అంటరానివాడుగా చూస్తుంటే ఇప్పుడు తానే వాళ్ళను అంటరాని వాళ్లుగా వుంచ గలిగినందుకు తనను తాను అభినందించుకున్నాడు.

తన వ్రతం చెరిపేందుకు చాలా ప్రయత్నాలు జరిగినవి. తను చూస్తూండగా మిగతావాళ్ళు డబ్బుపిండుకోవటం యీ ప్రయత్నాల్లో మొదటిది. ఇది చూసి తనకు పెరపెరలాడుతుందని వాళ్ళ అభిప్రాయం; కాని వాళ్ళది తప్పు అభిప్రాయమని తనే రుజూచేశాడు..ఐతే అంతటితో మిగతావాళ్ళు వెంకట్రావును వొదలలేదు. తనను లంచగొండిని చేసేందుకు ఎన్నో విధాలుగా తంటాలుపడ్డారు. ప్రార్థనలు దగ్గర్నుంచీ, బెదిరించటాల వరకూ వెళ్లారు. ఈ పద్ధతి మొదలుపెట్టిన దగ్గర్నుంచీ, వెంకట్రావు ఆశయానికి అదివరకులేని బలం, పట్టుదల అధికమైనవి.

ఏమైతేనేం – వెంకట్రావు కేవలం సామాన్యమానవుడు. మానవుడి అవసరాలు తనను వెంటాడుతూన్నంతసేపూ, జీవితం భారమవసాగాక, ఆయా సమస్యలకు లొంగకుండా వుండటమనేది తనకు సాధ్యమయ్యేది కాదనే మరో సత్యాన్ని కనిపెట్టక తప్పలేదు. నిజానికి పైకి తను మరింత పట్టుదలను సూచిస్తూ వొస్తున్నాడన్న మాటేగాని, లోలోన క్రమంగా తనకు తెలియకుండానే సడలిపోతున్నాడనేది – తను లొంగి పొయ్యేవరకూ కనిపెట్టలేక పొయ్యాడు.

భార్యకు జబ్బుచేసి, డాక్టర్ పరీక్షకు తీసుకువెళ్లాడు. డాక్టర్ క్షయచిహ్నాలు ఉన్నవని చెప్పటంతో వెంకట్రావులో సగం మనిషి చచ్చాడు. తను ప్రాణసమానంగా చూసుకునే భార్యను మృత్యువాత పడకుండా కాపాడవలసిన తన బాధ్యత ఒక వైపు, ఏది ఏమైనా ఖరీదైన చికిత్సను ఇచ్చేందుకు తగినంత సంపాదన లేకపోయిందే అనే బాధ మరో వైపూ అతన్ని ఒత్తిడి చేసినవి.

అదే మొదలు తన ఆశయం సడిలేందుకు. ఐతే అంత త్వరలో తాను దిగజారిపోతానని అతను ఎన్నడూ అనుకోలేదు. లంచాన్ని గూర్చి తిరిగి ఆలోచించ సాగాడు.

తన భార్యను బతికించుకోవాలంటే తానిప్పుడు లంచం పట్టటం మినహాగా మరో మార్గంలేదు. తన ఆశయానికి ఇది భిన్నమే – కాని భార్యను చేజేతులా మృత్యుముఖంలోకి తోసెయ్యటం గొప్ప ఆశయ మవుతుందా? ఆమెను బతికించుకోవటం తన కనీస ధర్మంకూడాను. వీటిని మించిన స్వార్థం ఉండనేవుంది–

మగవాళ్ళంతా నీతిగా బతుకుతూంటే, తానొక్కడే ఆ నీతిని అతిక్రమించటం కష్టం. కేవలం అందరూ చేసే పనే తాను కూడా చేయటంవల్ల, మిగతా ఉద్యోగుల దృష్టిలో తాను తక్కువయే అవకాశంలేదు. ఆమాటకొస్తే తనను కూడా తమతో

సమానంగా చేసుకోవాలని మిగతా ఉద్యోగులు తహతహలాడుతున్నారు. ఇన్నాళ్ళూ తాను బిగదీసుకొని ఉండగలిగాడు కాని, ఇప్పుడు వాళ్ళతో కలవక తప్పేట్లుగా లేదు.

విచిత్రమేమంటే యీ ఉద్యోగులు ఇంత లంచగొండులైన సంగతి ఆఫీసర్‌కు తెలిసికూడా వూరుకోవటం. ఆఫీసర్ కూడా కాస్తో, కూస్తో నంజేవాడే కావటంవల్ల ఒకళ్ళ లంచగొండితనాన్ని విమర్శించగల తాహతు ఆయనకు లేదు. రౌతునుబట్టి గుర్రం నడుస్తుంది కదా! అలాటి రౌతులో లేని ఆ నియమాల్ని ఇన్నాళ్లూ తాను అనుసరించి కాలాన్నీ, ధనాన్నీ కూడా వృథా చేసుకున్నాడు. ఏమైనా ఇప్పటికి మించి పోయిందిలేదు-

ఇన్ని కష్టాలూ ఒకేసారి ఎదురైతే తను మాత్రం ఏం చేయగలడు? లంచంపట్టటం పాపమే అనుకున్నా, ఆ లంచం పట్టిన ధనమంతా తన భార్య చికిత్సకోసం వినియోగించబడుతుంది కనుక, ఆ పాపమంతా ఆమెదే ఐతీరాలి; తాను మాత్రం నామమాత్రంగా మధ్యవుంటాడు - అంతే!

చివరకు లంచాన్ని పట్టేందుకు నిశ్చయించుకున్నా, వెంకట్రావు ఒకపట్టాన దానికి లొంగలేదు. మరికొన్ని నియమాల్నికూడా అనుసరించేందుకు అతను నిశ్చయించుకున్నాడు. అందులో మొదటిది - భార్య ఆరోగ్యవంతురాలు కాగానే లంచంపట్టటాన్ని మానెయ్యటం...తాను ఎవర్నీ బాధించకుండా, వాళ్ళకు ఇష్టమై ఇస్తే తప్ప తీసుకోకపోవటం. ఈ రెండో పద్ధతి తన అంతరాత్మకు ఎంతో తృప్తిని ఇస్తుంది. ఎందుకంటే లంచంపట్టటం అవినీతి ఐనప్పటికి, లంచం ఇవ్వటం కూడా అవినీతి అవకతప్పదు. ఇచ్చేవాడు ఉన్నప్పుడేకదా, తీసుకునేవాడంటూ వుండటం! కనుక అవినీతిలో సగభాగమే తనకు వర్తిస్తుంది. మొదటి నియమాన్ని అతను పాటించలేకపొయ్యాడు కాని, ఈ రెండో నియమాన్ని మాత్రం ఈనాటి వరకూ పాటిస్తూనేవున్నాడు.

లంచం పట్టేందుకు మొదటి అవకాశంకోసం వెంకట్రావు ఎక్కువకాలం వేచివుండనక్కర్లేకపోయింది. అంతకుపూర్వం తోటిగుమాస్తాలు తన కోసంగాను లంచంపట్టి తనకు ఇవ్వబోయినా నిరాకరించిన వెంకట్రావు, చడీచప్పుడూ లేకుండా వొచ్చినలంచాన్ని జేబులో వేసుకోవటంతో తోటిగుమస్తాలు మొదట ఆశ్చర్యపడినా, వెంకట్రావు లెక్క చేయలేదు. అది మొదలూ వెంకట్రావు మిగతావాళ్ళతో కలిసిపోయాడు.

సమయానికి తనకు లంచం ఆధారమైంది. వెంకట్రావు తన నియమాన్ని దూరాన వుంచబట్టే భార్యను బతికించుకోగలిగాడు. తమాషా ఏమంటే మొదట్లో కేవలం తన అవసరం వరకే లంచం పట్టాలనుకొన్న వెంకట్రావు వొస్తున్న దాన్ని వొదులుకోలేని అశక్తతకు గురయ్యాడు. డబ్బు కాస్త బాగా రాసాగాక, జీవితస్థాయికూడా పెంచాడు; చూస్తూ చూస్తూ సౌఖ్యాల్ని వొదులుకోవటం వెంకట్రావు ఆశయాల్లో ఒకటి ఎన్నడూ కాదు!

తరువాత తరువాత - వ్రతం చెడటమనేది ఒకసారి జరిగాక మరెన్నిసార్లు జరిగినా ఒకటేననే అభిప్రాయంతో వెంకట్రావు చేతిని తడిచేసుకోవటంలో వెనుకంజ వేయలేక పొయ్యాడు. దూరం ఆలోచిస్తే తనకన్న పెద్దజీతగాళ్ళే పాల్పడుతున్నారు; వారు దుర్మార్గంగా, ఎదుటి వ్యక్తిని కష్ట పెట్టయినాసరే తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. వాళ్ళతో పోల్చుకు చూస్తే తను చాలా నయం - పరమ దుర్మార్గుడికన్న, దుర్మార్గుడే నయమన్నట్టు!

-ఇంత పూర్వ చరిత్రవున్న వెంకట్రావు ఈనాడు కఫంలోపడ్డ ఈగ మాదిరి ఎటూతోచక ఛస్తున్నాడు. ఖర్చులు తగ్గించటమనేది అనుకునేటంత తేలిక కాదు. అందులోనూ ఏళ్ళ తరబడి అలవాటైన జీవితంనుంచి కిందికి దిగి రావటం తన శక్తికి మించిన పని! పోతే సంపాదనను ఏదో విధంగా పెంచటం తప్ప వేరేమార్గం లేదనేది నిర్ధారణగా తేలింది.

ఐతే యీ కొత్త వాతావరణం తన పై సంపాదనకు ఏ విధంగానూ అనుకూలంగా లేదు. మిగతావాళ్ళు ఎలా బతక గలుగుతున్నారో తనకు తెలియదు. తెలుసుకోవాల్సిన అవసరంకూడా లేదు. బుద్ధిమంతులల్లే, లంచం అనే మాటనే ఎన్నడూ వినని పరమపవిత్రులల్లే కనిపిస్తారు. అన్నిటినీ మించి ఆఫీసరంటే గజగజా వొణుకుతారు. ఆఫీసరు చాలా కఠినుడనీ, ఏ మాత్రం తప్పు జరిగినా వూరుకునేవాడు కాదనీ వెంకట్రావు మొదట్లోనే గ్రహించాడు. ఆఫీసర్నిబట్టే గుమాస్తాల ప్రవర్తన ఉంటుందనే సంగతి అతనికి కొత్త గాదు. తనుకూడా గుమాస్తాయే గనుక తనకూ వొళ్ళుదగ్గర ఉంచుకోవాల్సిన అవసరం తప్పలేదు.

తన సమస్యను ఎవరితో చర్చించగలడు? అందులోనూ ఎవరి గోలలో వాళ్లు ఉన్న ఆఫీసులో ఇది సాధ్యమయ్యేది కాదు. ఉద్యోగధర్మంలోనే కాస్త పై సంపాదనను చవిచూడగల అవకాశం ఉన్నప్పటికి ఆఫీసర్ అంటే భయం తనకూ ఉండబట్టి మెదలకుండా వూరుకోవాల్సి వొచ్చింది.

ఇట్లా ఎన్నాళ్ళు? యీ సంసారాన్ని యీదటం రోజు రోజుకూ కష్టతరమౌతోంది. తెగించి ఏమైనాచేస్తే అసలు ఉద్యోగానికే ఎసరయేట్లయితే - గుడ్డిలోమెల్ల, పరిపూర్ణ మైన గుడ్డిగానే మారుతుందేమో?

ఆలోచించగా ఆలోచించగా వెంకట్రావు ఒక నిశ్చయానికి వొచ్చాడు. అమిత జాగర్తగా వుండి, పట్టుబడేందుకు వీల్లేని పరిస్థితుల్లోనే కాస్త పుచ్చుకుందామని నిశ్చయించుకున్నాడు. పట్టుబడితే కదా - ప్రమాదం! అందుకని తేలిగ్గా సంపాయించటం, సులువుగా దూసుకోవటమే అతని ప్రస్తుత నిశ్చయం.

దీనికి ముందు కొంత వాతావరణాన్ని సృష్టించాలి. తోటి గుమాస్తాల వలెనే తనూ షేక్స్పియర్ మొహంవేయటం, తనపని తప్ప వేరే ఆలోచనే లేనట్లు నటించటం

మొదలుపెట్టాడు. దీంతో తమ వలెనే వెంకట్రావుకూడా యీ కొత్త వాతావరణానికి అలవడ్డాడని అందరూ అనుకోవాలని అతని అభిప్రాయం!

వెంకట్రావు అదృష్టంకొద్దీ ఒకనాడు ఆ అవకాశం వొచ్చే సూచనలు కనిపించినవి. బట్టలు లైసెన్స్‌కోసం తొందరపడే షావుకారు తారసిల్లాడు. ఆ షావుకారుతో వెంకట్రావు మాటలు పెంచలేదు. 'చూస్తాను' అనిమాత్రం అన్నాడు. షావుకారు దీనంగా, త్వరగా లైసెన్స్ ఇప్పించమని కోరాడు. తనను వేధిస్తున్నట్లుగా వెంకట్రావు కసురుకున్నాడు. ఆ తరువాత, సాయింత్రం ఆరింటికి రమ్మన్నాడు.

షావుకారు వెళ్ళిన దగ్గర్నుంచీ ఆ లైసెన్స్ విషయంలోనే అతని బుర్ర తీవ్రంగా పనిచేసింది. ఆ కాగితాలన్నీ బైటికిలాగి, ఫైలుకెత్తి, మెల్లిగా ఆఫీసరుకు పంపాడు. ఆఫీసర్ ఏ యావలో ఉన్నాడోకాని, నిమిషాల మీద పనై పోయింది. ఆ కాగితాన్ని జాగర్తగా డ్రాయర్‌లో పెట్టుకుని ఎప్పుడు ఆరవుతుందా అని వెంకట్రావు ఎదురు చూడసాగాడు.

ఐదున్నరకు ఆఫీసర్ బైటకి వెళ్ళాడు. మరో పది నిమిషాల్లో ఆఫీసులోని గుమాస్తాలందరూ బైటికివొచ్చేశారు. కొంపలుమునిగే పనివున్నట్లు వెంకట్రావుమాత్రం ఏదో రాసుకుంటూ, యేం జరుగుతోందో తెలుసుకునే తీరిక కూడా లేనట్లు తలవొంచుకునే కూర్చున్నాడు. తను తప్ప వేరెవ్వరూ ఆఫీసులో లేనట్లు గ్రహించగానే వెంకట్రావుకు ఎంతో రిలీఫ్ కలిగింది. అదృష్టంకొద్దీ అనుకూల వాతావరణం ఏర్పడినందుకు సంతోషించాడు-

ఈ బట్టలషావుకారు కాస్తముందు రాకూడదూ? ఒక వేళ ఇంకా ఆరుకాలేదని ఆ ప్రాంతాల్లో ఎక్కడైనా తారట్లాడుతున్నాడేమోననే అనుమానంతో వరండాలోకి ఉమ్మేసుకునేందుకు వొచ్చినట్లువొచ్చి అంతటా కలయజూచాడు. కాని అతనికి షావుకారు ఎక్కడా కనిపించలేదు...అసలు రాడేమో? రాకపోతే సిద్ధాన్నం నేలపాలైనట్లే!... షావుకారును మనసులో లెక్క లేనన్ని తిట్లు తిట్టుకున్నాడు.

నిమిషం ఒక యుగంగా షావుకారు కోసం వెంకట్రావు ఎదురు చూడసాగాడు ... ఆరు దాటిన దగ్గర్నుంచీ వెంకట్రావుకు ముళ్ళ మీద కూర్చున్నట్లుంది. ఈ షావుకారు తనను మోసం చేశాడనే అభిప్రాయంకూడా కలిగింది.

చివరకు ఆరుంబావుకు షావుకారు వొచ్చాడు. అతన్ని చూడగానే వెంకట్రావుకు ప్రాణం వొచ్చినట్లయింది. అంతకు పూర్వం అతని ముఖంలో కనిపించే విషాదం, క్షణంలో ఆనందంగామారి, చిరునవ్వు రూపాన బైటపడింది.

షావుకారు దగ్గరకు రాగానే "ఇదుగోనయ్యా లైసెన్స్...నానా అవస్థలూ పడి సంతకం చేయించాను" అని కాగితాన్ని అందించాడు వెంకట్రావు.

"రక్షించారు బాబూ! మీ పేరు చెప్పుకుంటాను–" అంటూ షావుకారు కాగితాన్ని అందుకున్నాడు.

ఈ పేరు చెప్పుకోవటంతోనే షావుకారు తన కృతజ్ఞత నంతట్నీ వెలిబుచ్చా డేమోనని వెంకట్రావు గుండెల్లో రాయిపడింది. ఆరునూరైనా తను మాత్రం చెయ్యి జాపదలచలేదు.

కాని షావుకారుకు యీ లౌకికాలు తెలియనివి కావనే సంగతి అతని జేబులోకి వెళ్ళిన చేతితోపాటు బైటికొచ్చిన వందరూపాయల నోటే చెప్పింది. వెంకట్రావు మాట్లాడకుండా ఆ నోటు వైపుకు చెయ్యి జాపాడు. ఎన్నడూ ఎరగని భయం అతన్ని మలేరియారోగల్లే చేసింది. వొణుకుతూన్న చేతితోనే నోటు అందుకొని, ఆశ్చర్యంతో, ఇంత తేలిగ్గా పనైనందుకు సంతోషంతో, వెంకట్రావు అట్టే నిలబడిపొయ్యాడు.

యీ స్థితిలో షావుకారు ఎప్పుడు వెళ్ళిపొయ్యాడో అతనికి తెలియదు. షావుకారు స్థానాన్ని ఆఫీసర్ ఎప్పుడు ఆక్రమించుకున్నాడో అసలే తెలియదు. తన నిజస్థితిని తెలుసుకునేప్పటికి పెద్ద భూకంపంలో తాను ఇరుక్కున్నాడు!

"ఉం. ఇదన్నమాట వ్యవహారం!' అని ఆఫీసర్ ఉరిమాడు.

ఏం చెప్పేందుకూ తోచక, వెంకట్రావు చేతులు నలుపుకుంటూ వొణికిపొయ్యాడు.

"సరే...రేపు చెపుతాను నీ సంగతి..." అని వందరూపాయిల నోటు లాక్కొని, నెంబరూ అదీ, వేరే కాగితంమీద వేసుకొని–ఆఫీసర్ వెళ్ళిపొయ్యాడు.

వెంకట్రావుకు యీ ఉద్యోగం పోతే ఆత్మహత్య తప్ప వేరే శరణ్యంలేదు. యీ షావుకారు తనపాలిట దేవతై వొచ్చి దయ్యమై విరమించాడు. వెధవ బతుకు మీద అతనికి రోతపుట్టింది. కాని ఇలా నిరాశపడటంకన్న ఆరిపొయ్యే దీపాన్ని ఏ విధంగానన్నా వెలిగించే అవకాశం వుందేమో చూడవలసిన తన కర్తవ్యం అతనికి వెంటనే గుర్తొచ్చింది.

ఆఫీసులోనుంచి బైటపడి పార్కులో ఒక మూలజేరి చాలాదూరం ఆలోచించాడు. తను లంచం తీసుకున్న సంగతి ఆఫీసర్‌కు ఒక్కడికే తెలియటం కొంతనయం. పోనీ షావుకారు ఇవ్వబోతూంటే తాను నిరాకరిస్తుండగానే అతను వెళ్ళిపోయాడని చెప్పుకుంటే ఎట్లా? ఒకవేళ అలాటిది నిజమే ఐనా, మెడకాయమీద తలకాయ అంటూ ఉన్నవాడు ఎవడు నమ్ముతాడు? ఇక యీ ఆఫీసర్ సంగతి వేరే చెప్పక్కర్లేదు – తీక్షణంగా చూస్తే కళ్ళనుంచి అగ్నికణాలు పడుతవి! అందుకని అబద్ధం ఆడటంకానీ, ఆఫీసర్‌కు టోపీ వేయటానికి ప్రయత్నించటంకానీ తనను మరింత అగాధంలోకి దింపుతవి. పోతే మిగిలిందల్లా కఠినుడైన ఆఫీసర్ కాళ్ళ మీదపడి తన యీ తప్పును కాపాడమని ప్రార్థించటమే!

దీనంగా, జాలిగా, బాధగా ఆఫీసర్‌కు కష్టసుఖాలను చెప్పుకోవాల్సిన పద్ధతిని వెంకట్రావు మనసులో జాగర్తగా రిహార్సల్ చేసుకున్నాడు. ఎన్నడూ వెంకట్రావు యీస్థితిలో ఎవర్నీ అర్థించలేదు...వెధవబ్రతుకు! దీన్ని లాగాలంటే ఎన్ని వేషాలు వేయాలి!

మళ్ళీ ఎక్కువసేపు ఆలోచిస్తూ కూర్చుంటే ఆఫీసర్ నిద్రపోవచ్చు. అందుకని వెంకట్రావు వెనువెంటనే ఆఫీసర్ ఇంటికి బయలుదేరాడు. యీ పద్ధతిలో తనకు తప్పక విజయం చేకూరుతుందని వెంకట్రావు గాఢంగా నమ్మాడు. ఆఫీసర్ ఇల్లు సమీపిస్తుండగానే వెంకట్రావు మొహంలో దీనత్వాన్ని ఘనీభవింపజేశాడు. పిల్లల్లే ఆఫీసర్ ఇంటికి వెళ్ళి, ఆయనకోసం విచారించాడు.

ఆఫీసర్, గదిలో కూర్చొని చదువు కుంటూన్నవాడల్లా బైటికి వచ్చాడు. అమాంతం వెళ్ళి కాళ్ళమీద పడదామని వెంకట్రావు అనుకున్నాడు కాని, అంతకన్న కాస్త తక్కువలోనే వ్యవహారాన్ని తేల్చుకోవొచ్చేమో చూద్దామనుకొని నమస్కరించాడు.

"ఎవరూ! వెంకట్రావా?...రా....లోపలికిరా-" అని ఆహ్వానించాడు ఆఫీసర్.

తన నమస్కారం పనిచేసినందుకు వెంకట్రావు సంతోషించాడు. తన ఆశలు పెరిగే అవకాశం వుంది కనుక, ఇదే ధోరణి సహాయకారిగా వుంటుందని నమ్మాడు.

గదిలోకి వెళ్ళగానే ఆఫీసర్ పడకకుర్చీలో కూలబడి, వెంకట్రావుకు ఒక కుర్చీ చూపాడు. కాని వెంకట్రావు ఆత్మ గౌరవాన్ని ప్రస్తుతం ప్రకటించదలుచుకో లేదుకనుకా, ఆఫీసర్ దయాధర్మాలకోసమే ఇక్కడికి పరుగెత్తుకొచ్చాడు కనుకా, చేతులు కట్టుకొని నిలబడి వున్నాడు.

'ఏమిటీ?' అన్నట్లు ఆఫీసర్ వెంకట్రావు వంక చూశాడు.

"తమరు రక్షించాలి. ఏదో బుద్ధి గడ్డితిన్నది. పిల్లలు గలవాణ్ని. యీ ఉద్యోగం పోయిందంటే ఆత్మహత్యే శరణ్యం...." ఇంకా ఇలాటివి లక్ష మాటలు చెప్పాడు వెంకట్రావు. ఆ మాటల్లో తన కుటుంబంలోని ప్రతి వ్యక్తికీ తానే ప్రాతినిధ్యం వహించాడు.

ఆఫీసర్ అంతావిని "ఐతే ఏమంటావ్? నీ కుటుంబంలోని వ్యక్తులు ఎవరుకూడా నిన్ను లంచం పట్టమనలేదు. నేను కూడా ఇలాటివి మెచ్చుకుంటా ననుకున్నావా-ఎవరి తప్పంటావ్?

"తప్పు నాదే అనుకోండి...కాని పరిస్థితుల వొత్తిడి వల్ల.."

"ఏం పరిస్థితులయ్యా! ఎవరి బాధలు వాళ్ళకు ఉన్నాయ్. పేరుకు ఐదొందలు జీతం నాకు వొస్తోందన్న మాటేకాని నాకు చాలుతోందనుకున్నావా? మొన్న మూడో కాన్పుకు అమ్మాయిని పంపాడు. ఆరొందలు ఖర్చయింది. మళ్ళీ సంవత్సరం

తిరక్కుండానే ఆమె పురిటికి తయారవకపోదు...యీ పరిస్థితుల్లో సంసారాన్ని లాగాలనే సాకుమీద లంచం పట్టటాన్ని ప్రభుత్వం హర్షిస్తుందా? లేక జీతం పెంచుతుందా?–"

వెంకట్రావు మాట్లాడలేదు.

"చూడు మిష్టర్ వెంకట్రావ్! నేను పట్టదలచుకుంటే వెధవ వందలు కాదు–వేలు పట్టవొచ్చు తెలుసా?" అన్నాడు ఆఫీసర్.

"ఎంత మాట! తమలాటి వారు నీతికి కట్టుబడే వున్నారు ... కాని నాలాటి అల్పులు–"

"–కనుక నా దగ్గర యీ వేషాలు పనికిరావు."

"ఈ మొదటి తప్పిదాన్ని క్షమించండి" అన్నాడు వెంకట్రావు–బలవంతంగా కళ్ళలోకి నీళ్ళను తెప్పిస్తూ.

ఆఫీసర్ ఇంకా యీ వాదనను పెరగనివ్వదలచలేదు. అన్నాడు : "సరే - ఫో యీసారికి వొదులుతున్నాను. ఇక ముందు కనక ఏ మాత్రం అనుమానం తగిలినా సరే నొక్కేస్తాను - జాగర్త."

బతుకు జీవుడా అని వెంకట్రావు బైట పడ్డాడు. ఇలాటి బుద్ధితక్కువ పని ఇంకెప్పుడూ చేయకూడదని నిశ్చయించుకున్నాడు.

ఏమో ఎటుపోయి ఎటొచ్చి ఆఫీసర్ తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడేమోననే అనుమానంతో నాలుగైదురోజుల దాకా వెంకట్రావు మామూలు మనిషవలేదు. ఇక ఆఫీసర్ ఆ విషయాన్ని తేడు అనే నమ్మకం కలిగాక, వెంకట్రావు పునఃపరిశీలనలో పడ్డాడు.

ఈ ఆఫీసర్ తనను క్షమించాడు - నిజమే కాని తను చేసిన తప్పేమిటి? వందరూపాయిలూ తను పుచ్చుకున్నాడన్న మాటేకాని గద్దల్లే ఆఫీసరే ఆ కాస్తా తన్నుకుపోయాడాయె! నిజానికి ఆఫీసరే నేరం చేశాడు. పైకిమాత్రం తనొక్కడే నేరస్థుడు–క్షంతవ్యుడూను!

తనను క్షమించిన ఆఫీసర్ - తన వందరూపాయిల నోటునూ ఇచ్చేస్తే ఎంత సంతోషించేవాడు! అప్పుడు నిజంగానే ఆయన తనను క్షమించినట్లయేది. ఈ సంగతి ఆయనకు విశదపరిచే ధైర్యం వెంకట్రావుకు లేదు. అలా చేస్తే పోయిన వందాపోగా, తన గొయ్యి తానే తవ్వుకున్న వాడవుతాడు.

అందుకని వెంకట్రావు తెలివిగా నోరుమూసుకున్నాడు. ఒకకొత్త నిశ్చయానికి కూడా వొచ్చాడు. ఎన్ని బాధలు పడ్డాసరే ఈ ఆఫీసర్ ఐనాసరే, తనైనాసరే ట్రాన్స్ఫర్ అయ్యేదాకా లంచంమాట తలపెడితే వొట్టు! అని.